క్లుప్తంగా

విక్రయానికి వరి విత్తనాలు సిద్ధం

సీతంపేట: స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో విక్రయానికి ఫౌండేషన్ వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని సీనియర్ సైంటిస్ట్ పి.సీతారాం ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. ఎంటీయూ- 1061, ఎంటీయూ-1064 రకాలు ఉన్నాయని, కిలో రూ.35 చొప్పున 25 కిలోల బస్తా ధర రూ.875గా నిర్ణయించడం జరిగిందన్నారు. విత్తనాలు కావాల్సిన వారు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల లోపు వచ్చి, కొనుగోలు చేసుకోవాలన్నారు.

సమయపాలన తప్పనిసరి

భామిని: విధి నిర్వహణలో సమయలపాలన తప్పనిసరిగా పాటించాలని సచివాలయ సిబ్బందికి డీఎల్‌డీఓ వి.గోపాలకృష్ణ సూచించారు. మండలంలోని బురుజోల, భామిని గ్రామ సచివాలయాలను శుక్రవారం సందర్శించిన ఆయన సిబ్బంది హాజరు, పనితీరు పరిశీలించారు. ప్రతిరోజూ సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించి, వినతులు స్వీకరించాలన్నారు. పీఎంజీఏ స్వై కార్డుల నమోదు పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు, ఏపీఓ తులసీదాస్ పాల్గొన్నారు.

విశాఖ వెళ్లి, పెన్షన్ అందజేత



విశాఖలో రాజేశ్వరమ్మకు పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ కార్తీక్

పాలకొండ రూరల్: అనారోగ్యం రీత్యా విశాఖ పట్నంలో ఉంటున్న పట్టణ పరిధిలోని దేవరపేటకు చెందిన టేకి రాజేశ్వరమ్మకు వలంటీర్ కార్తీక్ శుక్రవారం ఆమె వద్దకు వెళ్లి, పెన్షన్ అందజేశారు. దీంతో ఆమె, ఆమె కుటుంబ సభ్యులు సదరు వలంటీర్‌ను అభినందించారు.

నువ్వుపంటపై వర్షం దెబ్బ



ఉద్దవోలు బీటీ రోడ్డుపై తడిసిన నువ్వుపంటను ఆరబెడుతున్న రైతులు

గరుగుబిల్లి: వాతావరణంలోని మార్పుల కారణంగా కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని గరుగుబిల్లి, పెద్దూరు, ఉద్దవోలు, బీటీపురం గ్రామాల్లోని నువ్వుపంట దెబ్బతింది. సరిగ్గా పంటకు చేతికందే సమయంలో వర్షం తమను కష్టాల్లోకి నెట్టిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండబెట్టేందుకు పొలాల నుంచి రోడ్డు మీదకు తెచ్చుకున్న పంటంతా వర్షానికి బాగా తడిసిపోయిందని వాపోయారు. ప్రస్తుతం నెలకొన్న మబ్బు వాతావరణం మరో నాలుగు రోజుల పాటు కొనసాగితే తడిసిన పంట ఎండబెట్టుకునేందుకు అవకాశం ఉండదని, దీంతో పంట మొత్తం పూర్తిగా పోయే అవకాశం ఉందన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం



బాష్మతి జన్మనిచ్చిన బిడ్డతో అంబులెన్స్ సిబ్బంది

సీతంపేట: మండలంలోని పాండ్రఅక్కన్నగూడ గ్రామానికి చెందిన నిండు గర్భిణి సవర బాష్మతి 108 అంబులెన్స్‌లో శుక్రవారం ప్రసవించింది. ఉదయం ఆమెకు పురిటినొప్పులు రావడంతో వైద్యసేవల నిమిత్తం స్థానిక ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. కాన్పు కష్టతరం కావడంతో వైద్యుల సూచనల మేరకు శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఈ క్రమంలో ఆమెను అంబులెన్స్‌లో తరలిస్తుండగా, పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈఎంటీ రాము, పైలట్ మోహన్ సపర్యలు చేసి, పాలకొండ ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్య సిబ్బంది తెలిపారు.

7న ప్రవేశ పరీక్ష

కొమరాడ: స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల(బాలురు)లో 5 నుంచి 9వ తరగతి వరకు వివిధ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఈ నెల 7వ తేదీన పరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ ఎం.రాధాకృష్ణ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకు జరిగే పరీక్షకు అభ్యర్థులు హాల్ టికెట్ పట్టుకుని రావాలని కోరారు. దరఖాస్తు చేయని వారు స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



దండుసూర గ్రామంలో మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కురుపాం: అర్హతే ప్రామాణికంగా, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ పరిధిలో ఉన్న దండుసూర, దండుసూరగూడ, గంగన్నదొరవలస, నీలకంఠాపురం గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన ఆమెకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు అన్ని రంగాల్లో సమన్యాయం కల్పించాలన్నదే ఆయన ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రతీ ఇంటికి మేలు జరిగేలా ఆయన అమలు చేస్తున్న పథకాలతో గడప గడపన సంక్షేమ వెలుగులు వెల్లివిరుస్తున్నాయన్నారు. గతంలో ఏ ఒక్క అభివృద్ధి పని జరగాలన్నా, పథకం కావాలన్నా టీడీపీ జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. అలా ప్రజలు కష్టాలు పడకూడదనే గ్రామాల్లోకి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థతో ఇంటింటికీ సంక్షేమ పథకాలు చేరవేస్తున్న ఘనత జగనన్న సర్కారుకే దక్కుతుందన్నారు. ప్రజలకు చేస్తున్న మేలును చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, మళ్లీ సీఎం జగనన్ననే మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో నీలకంఠాపురం గ్రామ సర్పంచ్ అడ్డాకుల మన్మథరావు, కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, వైస్ ఎంపీపీలు బిడ్డిక అన్నాజీరావు, రంగారావు, ఎంపీటీసీ రాజేశ్వరి, మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు, రామకృష్ణ, ఆకుల శ్రీధర్, మాజీ ఏఎంసీ చైర్మన్ వెంకటరావు, కళింగ వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు అందవరపు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లోకోస్ యాప్ వినియోగంపై అవగాహన



వీఓలకు యాప్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న టీఓటీ బాలకృష్ణ

జియ్యమ్మవలస: స్థానిక వెలుగు కార్యాలయంలో లోకోస్ యాప్ వినియోగంపై వీఓఏలకు శుక్రవారం అవగాహన కల్పించారు. యాప్ డౌన్‌లోడ్, దాని వినియోగం, దానిలో పొందుపరచాల్సిన అంశాలు ఎలా పొందుపరచాలన్న అంశాలపై ఏపీఎం వెంకట్ శిక్షణ ఇచ్చారు. యాప్‌లో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉన్న మహిళా సంఘాల సభ్యుల వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. శిక్షణ పొందిన టీఓటీలు వీఓలకు దీనిపై శిక్షణ ఇస్తారు. గ్రామ స్థాయిలోని ఒక్కో వీఓఏ 30 సంఘాల నుంచి 60 సంఘాల లోపు సభ్యుల వివరాలు యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. 60 సంఘాలు దాటితే రెండుగా విడదీసి, ఇద్దరు వీఓలను కేటాయించి, సమాచారం సేకరించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీసీలు బాలకృష్ణ, పార్వతి, వీఓఏలు బాబూరావు, గౌతమి పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణానికి చర్యలు



వలగెడ్డలో ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

సీతంపేట: గిరిజన ప్రాంతాల్లో హిందూ ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి తెలిపారు. మండలంలోని వలగెడ్డ, మర్రిగూడ, పెదరామ గ్రామాల్లో కొత్తగా గ్రామదేవతల ఆలయాల నిర్మాణానికి శుక్రవారం ఆమె భూమిపూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ హిందూ ధర్మం కాపాడేలా ప్రభుత్వం పెద్దఎత్తున చర్యలు తీసుకుంటోందన్నారు. ఒక్క సీతంపేటలోనే దాదాపు రూ.10 కోట్ల వ్యయంతో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని అత్యంత వైభవంగా నిర్మించడం చాలా గొప్ప విషయమన్నారు. గిరిజనులంతా ఇక్కడే శుభకార్యాలు చేసుకునేలా కల్యాణ మండపం కూడా నిర్మించారన్నారు. ఈ అవకాశాన్ని గిరిజనులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహన్‌రావు, సర్పంచ్‌లు హెచ్.ఆదిలక్ష్మి, తిరుపతిరావు, మౌనిక, పార్టీ నాయకులు ఎం.రామారావు, ఎస్.కాంతారావు, ఎస్.మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

శతశాతం ప్రకృతి వ్యవసాయ మండలంగా తీర్చిదిద్దాలి

- ఏపీ సీఎస్‌ఎఫ్ రీజనల్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కృష్ణారావు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏపీ సీఎస్‌ఎఫ్ రీజనల్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కృష్ణారావు

గుమ్మలక్ష్మీపురం: మండలాన్ని శతశాతం ప్రకృతి వ్యవసాయ మండలంగా తీర్చిదిద్దాలని ఏపీ సీఎస్‌ఎఫ్ స్టేట్ రీజనల్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కృష్ణారావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో డీపీఎం పి.షన్ముఖరాజు సమీక్ష సమావేశం నిర్వహించగా, సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసి, ఆరోగ్యవంతమైన పంటలను సమాజానికి అందించాలని తెలిపారు. మండలంలోని 48 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తుండగా, మిగిలిన గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించేలా చూడాలని సూచించారు. అలాగే ప్రకృతి వ్యవసాయం వల్ల వచ్చే లాభాలను రైతులకు వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ పద్ధతులకు సంబంధించి, రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జట్టు ట్రస్టీ డి.పారినాయుడు, అడిషనల్ డీపీఎం ధనుంజయరావు, ఎమ్‌టీలు జి.నిర్మలాదేవి, బాలామణి పాల్గొన్నారు.

ప్రజాశ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే జోగారావు



గడపగడపకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: ప్రజాశ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పార్వతీపురం మండలం బందలుప్పి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. సర్పంచ్ యాళ్ల ప్రమీల, ఎంపీపీ మజ్జి శోభారాణితో కలిసి గ్రామాన్ని సందర్శించి ప్రతి గడపకు వెళ్లారు. గడిచిన మూడేళ్లలో నవరత్నాల పేరిట జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ఈ క్రమంలో ఆయా గ్రామంలో ప్రతి ఇంటికి అందించిన లబ్ధి గురించి క్షుణ్ణంగా తెలియజేశారు. అందుకు సంబంధించిన బుక్‌లెట్‌ను వారికి అందించారు. ఈ తరుణంలో గ్రామానికి సంబంధించి తాగునీరు, రహదారులు, డ్రైనేజీల సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసకువచ్చారు. వాటిపై సానుకూలంగా స్పందించిన ఆయన వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నాడు-నేడు ద్వారా అభివృద్ధి చెందిన ప్రభుత్వ పాఠశాలను, అంగన్వాడీ వైఎస్సార్ ప్రీస్కూల్‌ను సందర్శించారు. అక్కడి పిల్లలతో మమేకమయ్యారు. వారి విద్యా ప్రమాణాలను తెలుసుకునేందుకు పలు ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల ఆరోగ్య రక్షణలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

కార్యక్రమంలో జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, వైస్ ఎంపీపీలు సిద్ధా జగన్నాథరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఆత్మ చైర్మన్ వై.తిరుపతి రావు, నాయకులు యాళ్ల శ్రీరాములు, జక్కు ప్రవీణ్, భీమవరం కృష్ణ, వై శ్రీరాములు నాయుడు, భూపతి రావు, తాన్న శ్రీరాములు, ఎంపీటీసీ సభ్యులు స్టేట్‌కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు ,కోఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు జేసీఎస్ కన్వీనర్ వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

పాలకొండ రూరల్: స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగభూషణరావు ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ విచ్చేస్తారని, కమిటీ సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

1134 లీటర్ల సారా పారబోత



పట్టుబడిన సారాను పారబోస్తున్న పోలీసులు

సీతంపేట: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్‌ఈబీ ఆధ్వర్యంలో దాదాపు 1134 లీటర్ల సారాను శుక్రవారం పారబోసినట్లు ఎస్‌ఐ నీలకంఠం గురువారం తెలిపారు. ఏజెన్సీలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన 49 కేసుల్లో ఆ సారాను పట్టుకున్నామని పేర్కొన్నారు.

పక్కాగా సోషల్ ఆడిట్



మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ తిరుపతిరావు

గరుగుబిల్లి: ఉపాధి హామీ పనులకు సంబంధించి, పక్కాగా సోషల్ ఆడిట్ నిర్వహించాలని ఎస్ఆర్‌పీ ఎం.తిరుపతిరావు సూచించారు. ఇదే విషయమై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, సర్పంచ్‌లతో శుక్రవారం సమావేశమైన ఆయన గత ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు జరిగిన పనులకు సంబంధించి, చాలా క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టడం జరుగుతోందన్నారు. మొత్తం 11.75 కోట్ల వ్యయంతో చేపట్టిన 519 పనులకు సంబంధించి, సోషల్ ఆడిట్ నిర్వహించడం జరుగుతోందన్నారు. ఆడిట్ అనంతరం ప్రజావేదిక నిర్వహించి, వివరాలు వెల్లడించాలన్నారు. సమావేశంలో ఎస్ఆర్‌పీ ఎం.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

సమీకృత వ్యవసాయమే లక్ష్యంగా పనిచేయాలి

వీరఘట్టం: సమీకృత వ్యవసాయమే లక్ష్యంగా పనిచేయాలని డివిజనల్ ఉద్యాన శాఖ అధికారి అమరేశ్వరి, ఏపీఎం శివున్నాయుడు సూచించారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన అధికారుల సమావేశంలో పాల్గొన్న వారు రైతు ఉత్పత్తిదారుల సంఘంలోని ప్రతీ కుటుంబ జీవనోపాధులు మెరుగుపరచాలని, ప్రతీ క్లస్టర్ పరిధిలో 250 నుంచి 300 గ్రూపులు ఏర్పాటు చేసి, వారందరితో సమీకృత వ్యవసాయం చేయించాలని తెలిపారు. సమావేశంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు పి.బలరాం, ఎం.ఎం.ఎస్ అధ్యక్షురాలు పి.సుజాత, పశువైద్యాధికారి చైతన్య, సీసీ ఆనందరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడతున్న ఏపీఎం శివున్నాయుడు

'ఉపాధి' పనిదినాలు పెంచండి



ఉపాధి హామీ పనుల రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామచంద్రరావు

భామిని: ఉపాధి హామీ పని దినాలు పెంచాలని పార్వతీపురం మన్యం జిల్లా డ్వామా పీడీ ఆర్.రామచంద్రరావు సూచించారు. మండలంలోని పసుకుడి గ్రామ కొత్తచెరువు దగ్గర జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో ఉపాధి హామీ పనుల రికార్డులు పరిశీలించి, అధికారులతో సమీక్షించారు. వేతనదారుల సంఖ్య కూడా పెంచాలని, వారికి గిట్టుబాటు అయ్యే వేతనం లభించేలా పనులు చేయించాలని, వేసవి నేపథ్యంలో వారు వడదెబ్బ బారినపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు, ఏఈఓ ఇ.తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోలుబంకు నిర్మాణ స్థలం పరిశీలన



పెట్రోలుబంకు నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

కురుపాం: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల(బాలురు) సమీపంలో పెట్రోలు బంకు నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ శుక్రవారం పరిశీలించారు. ఇక్కడ ప్రభుత్వ భూమి ఎంత మేర ఉందో నివేదిక ఇవ్వాలని, అలాగే పెట్రోలుబంకు పనులు త్వరితగతిన చేపట్టాలని తహసీల్దార్ రాకోటి సురేష్‌కుమార్‌కు సూచించారు.

పైడితల్లి పండగకు రండి..!



ఎమ్మెల్యే కంబాల జోగులుకు పైడితల్లి మహోత్సవ ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

వీరఘట్టం: మండల కేంద్రంలో జరిగే పైడితల్లి పండగకు రావాలని కోరుతూ ఉత్సవ కమిటీ సభ్యులు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులకు శుక్రవారం ఆహ్వాన పత్రికలు అందజేశారు. దాదాపు ఏడేళ్ల తర్వాత జరిగే అమ్మవారి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈ వైభవాన్ని చూసి తరించాలని కోరారు. రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, కురుపాం ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి, పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు, మాజీ మంత్రి కళావెంకటరరావు, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి, పాలకొండ సబ్‌కలెక్టర్ నూరల్ కమర్‌కు ఆహ్వాన పత్రికలు అందజేసినట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

వీరఘట్టం: మండలంలోని వండవ గ్రామంలో శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ఐదో వార్షికోత్సవం పురస్కరించుకుని, శివపార్వతుల కల్యాణం శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి స్వామి వారి కల్యాణోత్సవం తిలకించి, ప్రత్యేక పూజలు చేశారు. ఏటా పంటలు బాగా పండి, అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వేడుకున్నారు. ఆమె వెంట ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, సర్పంచ్ మిడితాన కల్యాణి ఉన్నారు.

ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలి



ఇంటర్మీడియట్ ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న ఎంఈఓ నాగభూషణరావు

జియ్యమ్మవలస: ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ ఎన్.నాగభూషణరావు సూచించారు. మండలంలోని చినమేరంగి కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)లో ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను శుక్రవారం సందర్శించారు. విద్యార్థులు బాగా చదివేలా చూడాలని, వారికి సంబంధించిన సబ్జెక్ట్‌లో ఉన్న సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసి, ఆ సబ్జెక్ట్‌లో వారు పట్టు సాధించేలా చూడాలన్నారు. ఇలా అయితే ప్రతిఒక్కరూ ఉత్తీర్ణత సాధిస్తారన్నారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న మన బడి నాడు-నేడు పనులను పరిశీలించి, నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేపట్టాలని సిబ్బందికి తెలిపారు. ఆయన వెంట సీఆర్‌పీ సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే పారదర్శక పాలన

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కళావతికి ఘనస్వాగతం పలుకుతున్న ప్రజలు

సీతంపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో పారదర్శక పాలన సాధ్యమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని దారపాడు సచివాలయం పరిధిలో ఉన్న రామానగరం, దాని సమీప గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆమె నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆమె దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అందరూ బాగుండాలన్నదే సీఎం జగనన్న ధ్యేయమని, ఆ దిశగా ఆయన అనేక పథకాలు, కార్యక్రమాలు రూపొందించి, అమలు చేస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ఆయన సంక్షేమ పథకాలు అందిస్తున్న తీరు దేశానికే ఆదర్శమన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును చూసి, సహించలేని ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, అయితే వాటిని ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. గతంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా మండల కేంద్రానికి వెళ్లాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇది సామాన్య ప్రజానీకానికి ఎంతో వ్యయప్రయాసమన్నారు. ఆ పరిస్థితులను దూరం చేసి, జనానికి సుపరిపాలన అందిస్తున్న గొప్పతనం మన ముఖ్యమంత్రి జగనన్నది అన్నారు. గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో కూడా మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతోందన్నారు. గిరిజన గూడలకు కూడా వైద్యం అందేలా బైక్ అంబులెన్స్‌లను ఇప్పటికే ఏర్పాటు చేయగా, సీతంపేటలో కొత్తగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం జరుగుతోందన్నారు. అన్ని వర్గాలను అన్ని రంగాల్లో సమాన ప్రాధాన్యమిస్తున్న సీఎం జగనన్నను వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించి, మళ్లీ ఆయనను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, వైస్ ఎంపీపీ కె.సరస్వతి, సర్పంచ్‌లు సుందరమ్మ, వెంకునాయుడు, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

పాలకొండ రూరల్: మండలంలోని గోపాలపురం గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ బి.శివప్రసాద్ శుక్రవారం తెలిపారు. వారి నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలు, రూ.2,570 స్వాధీనం చేసుకున్నామన్నారు.